క్లుప్తంగా

వసుధ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



ఆర్థిక సహకారం అందిస్తున్న మంతెన వెంకట రామరాజు, కలెక్టర్ ప్రశాంతి

పాలకోడేరు : ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న వసుధ ఫౌండేషన్ అధినేత మంతెన వెంకట రామరాజు మన జిల్లా గరగపర్రు గ్రామానికి చెందిన వారు కావడం మనందరికీ గర్వ కారణం అని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం గరగపర్రులోని వసుధ వాత్సల్య నిలయంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్మన్ వెంకట రామరాజు 2023 సంవత్సరానికి గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 35 సేవా సంస్థలకు, రూ.65 లక్షల ఆర్థిక సహకారం అందించారు. విద్యా, వైద్య, ఉపాధి కార్యక్రమాలుగా విద్యార్థులకు, రోగులకు రూ.5 లక్షల మేర ఆర్థిక సాయం అందించారు. పది మందికి కుట్టుమెషీన్లు అందించారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, కలిదిండి రామ కృష్ణంరాజు పాల్గొన్నారు.

వంతు నీరు తోడుతున్న 21 మోటార్ల సీజ్

ఆకివీడు: కాలువల ద్వారా వంతుల వారీగా అందిస్తున్న సాగునీటిని అక్రమంగా చేపలు, రొయ్యల చెరువులకు తోడుతున్నట్లు గుర్తించి పలు చోట్ల చెరువుల యజమానులు ఏర్పాటు చేసిన 21 మోటార్లను సీజ్ చేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈ ఎంవీవీ పెద్దిరాజు చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లోని పంట కాల్వలను మండల బృందం మంగళవారం తనిఖీ చేసింది. సమతానగర్‌లో 10, కోళ్లపర్రులో 7, గుమ్ములూరులో 4 విద్యుత్ మోటార్లను సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీ బృందంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వర్లు, ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారన్నారు. వంతుల నీటిని రైతులు వినియోగించుకోవాలని, వంతులేని సమయంలో చెరువులకు నీటిని తోడుకోవచ్చునని వారు సూచించారు. వరి సాగుకు ఇబ్బంది వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

వీరవాసరం: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డబ్ల్యూఎస్ డీఈ కే ధనరావు తెలిపారు. రాయకుదురులో ఉన్న మంచినీటి చెరువును మంగళవారం ఆయన ప్రత్యేకంగా సందర్శించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కనకారావు, గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి, ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావు, గెడ్డం భాస్కరరావు, చిలకపాటి సునీత, దుర్గాప్రసాద్, విప్పర్తి రాధాకృష్ణ, పి.పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్‌లో పాలిఫెస్ట్ వేడుక

సాక్షి, భీమవరం: స్థానిక డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం పాలిఫెస్ట్ నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వంతోపాటు వివిధ రకాల నైపుణ్యాలను పెంపొందించడానికి ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

స్త్రీని గౌరవిస్తేనే మెరుగైన సమాజం



దుంపగడపలోని డిగ్రీ కళాశాలలో సత్కారం అందుకున్న మహిళలతో విద్యార్థినులు



ఆకివీడు : ఆడపిల్లా అని అని దిగులు పడకమ్మా అంటూ తల్లులకు భరోసా ఇస్తూ, ఆ ఇంట సంతోషాన్ని అందిస్తున్న ఆడపిల్లలు నేటి సమాజంలో కోకొల్లలుగా ఉన్నారని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ కనుమూరి లక్ష్మీ మాధవి చెప్పారు. మండలంలోని దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాధవి మాట్లాడుతూ జీవరాశి ఆవిర్భావానికి స్త్రీ పాత్ర అద్భుతమన్నారు. ప్రతి మహిళా ధైర్యంలో కిరణ్ బేడీ, ఆర్థిక వ్యవహారాల్లో నిర్మలా సీతారామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మరో ముఖ్య అతిథి పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా సమానత్వం సాధించటమే మహిళా సాధికారిత సాధించినట్లు అని అన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ కనపర్తి సుజాత అధ్యక్షత వహించారు. స్థానిక జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పీ.విజయభాస్కర్ మాట్లాడుతూ స్త్రీని గౌరవించడం ద్వారా మెరుగైన సమాజం ఏర్పడుతుందన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

మహిళలతోనే సమాజాభివృద్ధి

సాక్షి, భీమవరం: మహిళలు అన్నిరంగాల్లో రాణించినపుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాల్ అధ్యక్షుడు బండి శక్తీశ్వర సాంబమూర్తి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టౌన్‌హాల్ ఆధ్వర్యంలో పట్టణంలోని పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి మంగళవారం విజేతలకు, ఉపాధ్యాయులకు బహుమతుల అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్‌హాల్ ఆధ్వర్యంలో పాఠశాల అభివృద్ధికి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ హాల్ కార్యదర్శి గ్రంధి సురేష్, జాయింట్ సెక్రటరీలు అడపా బాబ్జి, జీఎన్ ఫిరోజ్‌బాబు, సభ్యులు మేళం శ్రీధరప్రభాకర్, మేళం నాగేశ్వరరావు, భూపతిరాజు పేర్రాజు, సత్యనారాయణరాజు, స్కూల్ హెచ్‌ఎం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

కాళ్ల : మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పాటు సమానంగా పనిచేస్తున్నారని మహిళా న్యాయవాదులు ఎంబీ భవాని, పి.రాధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద డ్వాక్రా మహిళలకు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సదస్సుకు కాళ్ల మండల సమాఖ్య ఏపీఎం కె.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మహిళా న్యాయవాదులు మాట్లాడుతూ మునుపటి కంటే నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులతో పాటు సమానంగా పనిచేస్తున్నారని అన్నారు. విద్య, క్రీడలు, ఉద్యోగం, రాజకీయం మొదలగు వాటిలో ముందుటున్నారని స్పష్టం చేశారు. అనంతరం గృహ హింస, మనోవర్తి,, వారసత్వపు ఆస్తిలో సమాన హక్కు, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యత గూర్చి వివరించారు. సమాన పనికి సమాన వేతనం, వృద్ధుల పోషణ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నేడు చిన్న పిల్లలపై అకృత్యాలకు ప్రధాన కారణమైన మొబైల్ వినియోగంపై తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలన్నారు. డ్వాక్రా మహిళల మండల అధ్యక్షురాలు మహాలక్ష్మి, డ్వాక్రా మహిళలు, కోర్టు సిబ్బంది శశికళ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాణిస్తేనే.. దేశ ఆర్థికాభివృద్ధి

సాక్షి, భీమవరం: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే దేశ ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఇండియన్‌బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంఎస్ రామారావు అన్నారు. ప్రపంచ మహిళాదినోత్సవం సందర్భంగా పట్టణంలోని పొట్టిశ్రీరాములుమునిసిపల్(పీఎస్ఎం) గరల్స్ హైస్కూల్‌కు మంగళవారం కంప్యూటర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఛీఫ్ మేనేజనర్ రామమోహనరావు, స్కూల్ హెచ్‌ఎం జె.సుధారాణి, సారిక, హిందు, వారణాశి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉండిలో...

ఉండి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఉండిలోని వైఎస్సార్ సీపీ నాయకులు గుండాబత్తుల సుబ్బారావు నివాసం వద్ద ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు హాజరవుతారని, మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.



భీమవరం టౌన్ హాల్ ఆధ్వర్యంలో బహుమతులు అందచేస్తున్న దృశ్యం



కాళ్లలో సమావేశంలో మాట్లాడుతున్న మహిళా న్యాయవాదులు



భీమవరం పీఎస్ఎం గరల్స్‌హైస్కూల్‌కు కంప్యూటర్‌ను బహూకరిస్తున్న దృశ్యం

డ్రిల్‌తో బాలికలకు మనోధైర్యం



సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాలలో డ్రిల్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ఆకివీడు : బాలికల మనోధైర్యానికి డ్రిల్ ఎంతగానో ఉపయోగపడుతుందని స్థానిక సరోజినీనాయుడు బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పీఎస్.కాంతం చెప్పారు. పాఠశాలలో వ్యాయామ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారని, అదే విధంగా విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించడంలోనూ, ఉద్యోగాలు పొందడంలో ముందంజలో ఉంటున్నారని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు కూనా నీలవేణి మాట్లాడుతూ బాలికల దశ నుంచి మనోధైర్యం, శారీరక ధారుడ్యం పెంపొందించుకునేందుకు వ్యాయామం, యోగా, కరాటే వంటి వాటిలో శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో డ్రిల్‌కు అనువుగా పాఠశాల ఆవరణను కౌన్సిలర్ పుప్పాల పండు చదును చేయించడంతో ఆయనకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు
- సమ్మిట్ విజయవంతంపై పార్టీ శ్రేణుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు

కాళ్ల : రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతంపై మండలంలోని పెదఅమీరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహారాజు, పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మిట్‌కు ఎందరో పారిశ్రామికవేత్తలు తరలివచ్చి రాష్ట్రంలో రూ.13 లక్షల పెట్టుబడులు పెట్టెందుకు ముందుకురావడం హర్షణీయమన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో సుమారు 6 లక్షల మందికి ఉపాధి కలిగే అవకాశం ఉందన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్తలు అదానీ, ముఖేష్ అంబానీ తదితరులు ఎందరో తరలి రావడంతో ప్రతిపక్షాల గుండెల్లో గుబులు మొదలైందని, దీంతో ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎప్పుడూ టెక్నాలజీని నేనే తీసుకువచ్చానని హైదరాబాదుని తానే అభివృద్ధి చేశానని చెప్పుకునే చంద్రబాబు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాధించిన విజయాన్ని ఓర్చుకోలేకపోతున్నాడని విమర్శించారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రసారాలను తిప్పి కొట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన సూచనలు చేశారు. అందరికీ ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ముందుగా రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు మృతికి సంతాపం వ్యక్తం చేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల, ఉండి, ఆకివీడు జెడ్పీటీసీలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, రణస్థుల మహంకాళి ఎంపీపీలు పెన్మత్స విశ్వనాథరాజు, భూపతిరాజు చంటిరాజు, ఇందుకూరి హరిబాబు, కటారి జయలక్ష్మి, ఆకివీడు మునిసిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, మండల కన్వీనర్లు గణేష్ రాంబాబు, పెన్మెత్స ఆంజనేయరాజు, కటిక శ్రీదేవి, గుండుగొలను ధనరాజు, సొసైటీల చైర్మన్లు పెన్మెత్స ప్రసాదరాజు, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, సుంకర భోగేశ్వరరావు, కేశిరెడ్డి మురళి, పేరిచర్ల సూర్యనారాయణరాజు, నియోజకవర్గంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైల్వే రవాణా ఆదాయం పెంపునకు సహకరించాలి



డీసీఎం రాంబాబును సత్కరించిన దృశ్యం

ఆకివీడు : పడిపోతున్న రైల్వే రవాణా ఆదాయం పెంపునకు సహకరించాలని రైల్వే సీనియర్ డీసీఎం(కమర్షియల్) రాంబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద గూడ్స్ షెడ్ ప్రాంతంలో హమాలీలు, ఎఫ్‌సీఐ ఉద్యోగులు, రైల్వే ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. డీసీఎం మాట్లాడుతూ డబలింగ్ విద్యుద్దీకరణకు ముందు ఈ ప్రాంతం గూడ్స్ వ్యాగన్ల రవాణా ద్వారా సుమారు రూ.10 కోట్ల పైబడి ఆదాయం వచ్చేదని ప్రస్తుతం కేవలం రూ.2, 3 కోట్లు ఆదాయం మాత్రమే వస్తుందని చెప్పారు. సివిల్ సప్లయ్ శాఖకు చెందిన బియ్యం ఇతర జిల్లాలకు లారీల ద్వారా రవాణా జరుగుతుండడమే ఇందుకు కారణమన్నారు. స్టేషన్ సూపరింటెండెంట్ మాణిక్యాలరావు, సీసీఎస్ఆర్ నందేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన ప్రముఖులు



ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి జయ మంగళ వెంకటరమణ

సాక్షి, భీమవరం: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి జయ మంగళ వెంకటరమణ మంగళవారం రాత్రి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి మద్దతుగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సంబంధిత పత్రాలపై సంతకం చేసి ఆయనకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో అందరికీ గుర్తింపు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారందరికీ తగిన గుర్తింపు తప్పక ఉంటుందని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. పార్టీ సేవాదళ్ అధ్యక్షుడిగా నియమితులైన భలే ఏసుబాబు మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ భలే లూర్దమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కోడె యుగంధర్, కందికట్ల ఎడ్వర్డ్, జంగం మాణిక్యాలరావు, పెనుమాల నర్సింహస్వామి, గెడ్డం భాస్కరరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

అభివృద్ధికి, సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. చిన అమిరం గ్రామ పరిధిలోని సాయిబాబా కాలనీ ప్రజలు మంగళవారం రాత్రి ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి తమ ప్రాంతంలో తాగునీటి పైపులైను, రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ తాగునీటి అవసరాలను తీర్చేందుకు జలజీవన్ మిషన్ పథకంలో రూ 56 లక్షల నిధులను మంజూరు చేశామని తెలిపారు. కాగా సాయిబాబా కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గొట్టుముక్కల సత్యనారాయణ రాజు (ధర్మరాజు), గొట్టుముక్కల పద్మరాజు, గుడిమెట్ల కోటవీర నాగయ్య పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ఆకివీడు : వరిలో యజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించడం సాధ్యమని జిల్లా వనరుల శాఖ అధికారి చింతల శ్రీనివాస్ సూచించారు. ఆత్మ ఆధ్వర్యంలో మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో మంగళవారం సమగ్ర సస్యరక్షణపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి ఉందని, నీటి యాజయాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునున్నారు. ఏడీఏ కేఏఎస్ఎస్.శ్రీనివాస్,ఏఓ ప్రియాంక ధాన్యం కొనుగోలు, పంట దిగుబడులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

డీఎన్నార్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

సాక్షి, భీమవరం: భీమవరం డీఎన్నార్ కళాశాల నూతన కార్యవర్గం మంగళవారం కళాశాలలో ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గోకరాజు వెంకటనర్సింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షులుగా గోకరాజు పాండురంగరాజు, చేకూరి శ్రీనివాస రాజు, జాయింట్ సెక్రటరీ అండ్ కర్సపాండెంట్‌గా కూనపరాజు రామకృష్ణంరాజు, కోశాధికారిగా కొత్త వెంకటశ్రీరామనారాయణ, అసిస్టెంట్ సెక్రటరీగా కొత్తపల్లి శివరామరాజు, పాలకవర్గ సభ్యులుగా అల్లూరి సుబ్బరాజు(ఏఎస్ రాజు), చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, జంపన రామలింగరాజు, నంద్యాల మదన్‌మోహన్‌లచ్చిరాజు, మంతెన వెంకటకృష్ణంరాజు, మంతెన వెంకటవిశ్వనాధసత్యనారాయణవర్మరాజు, ఎన్‌వీ సత్యనారాయణరాజు, వేగేశ్న వెంకటసత్యనాగభాస్కరబంగార్రాజు తదితరుతో ఎన్నికల అధికారి కె.రఘురామ్ ప్రమాణ స్వీకారం చేయించారు.

పంట కాల్వలోకి రొయ్యల వ్యర్థాలు

ఆకివీడు : తరటావ గ్రామంలోని మంచినీటి చెరువుకు వచ్చే పంట కాల్వలోకి ఓ రైతు రొయ్యల వ్యర్థాలను విడుదల చేయడంపై డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థాలతో కూడిన నీరు పంట కాల్వలోకి చొచ్చుకువస్తుందని గ్రామస్తులు, ఉపసర్పంచ్ హనుమాన్ ప్రసాద్, మాజీ సర్పంచ్ దివాకర్ పీవీఎల్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం ఆయన పంట కాలువను పరిశీలించారు. రొయ్యల వ్యర్థాల నీరు పారే విధానాన్ని తక్షణం నిలుపుదల చేసి, పంట కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాల్ని తొలగించాలని పీవీఎల్ ఆదేశించారు. సంబంధిత రైతు తక్షణం చర్యలు చేపట్టకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం చినకాపవరం గ్రామంలోని బుచ్చి వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్మించిన అదనపు గదుల్ని పీవీఎల్ ప్రారంభించారు. తొలుత స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను), ఎంపీపీ కఠారి జయలక్ష్మి, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో విచారణ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక బీసీ బాలుర హాస్టల్‌లో గతేడాది అక్టోబర్ 26న 15 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు విచారణాధికారి పి.శ్యామ్ కుమార్ మంగళవారం హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ సిబ్బందితో మాట్లాడి విచారణ నిర్వహించారు. హాస్టల్‌ను పరిశీలించి తదుపరి రిపోర్ట్‌ను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట హాస్టల్ సంక్షేమ అధికారి జి.గణపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ స్వాధీనం

పాలకోడేరు : ప్రభుత్వ అనుమతి లేకుండా బొండు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీను పోలీసులు పట్టుకున్నారు. నల్లజర్ల మండలం చొడవరానికి చెందిన పొన్నాడ సత్యనారాయణ లారీలో బొండు ఇసుకను వేసుకుని పాలకొల్లు వైపు వెళ్తుండగా శృంగవృక్షం వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. లారీని స్వాధీనం చేసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.